# రాళ్లెత్తిన కూలీ

వాన కురిసి వెలిసిన ఆకాశం......

అంతరించిపోతూన్న సాయంత్రపు వింత కాంతులు పుంతలు పుంతలుగా... పులకింతలుగా ..... కిల కిల కేరింతలు పక్షులుగా వికీర్ణమై.....

రెల్లు చూరు మీద నుంచీ ఒక్కటొక్కటిగా వాన చుక్కలు ఒకదాని వెంటింకొకటి.... నిశ్శబ్దంగా క్రింద శ్వేత సంవర్తి కల హస్తాలు జాచి ఆహ్వానిస్తూన్న నందివర్ధనంలోకి దూకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నాయి.

తనలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న... ఆ సంధ్యాస్నానం చేసిన వర్షపు బిందువులు ఆత్మల్ని ఆలింగనం చేసుకుని బరువెక్కిన నంది వర్ధనం ఆనందంగా ఊగుతోంది.

తన్మయత్వంతో...... ఆ నందివర్ధనాన్నీ...

ఆ నందివర్ధనంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్న నీటి బిందువుల్నీ చూస్తూ.. ఆమె..

తెల్లటి చీరలో ఆమె...

అనాది కాలం అల్పమై.... యిదం యీ క్షణం యిప్పుడు అనిపించే రీతిలో... ఎక్కడో మొదలై సుడులు తిరిగి మడతలు మడతలై, విడుచుకు విప్పారి... ఆమె తనూగంధాలింగనంతో పరవశించి నలిగి నలిగి అలరాలుతున్న తెల్లచీర కుప్పగా ఆమె.... ఆమెగా తెల్లచీర!

జడి వదలిన కాంతుల్లో, సుడి తిరిగిన భ్రాంతుల్లో, యుగాల పేజీల నాగరికతైన ఆమె ఒడిలో, తెల్లటి మడతల్లో, చీర కుచ్చిళ్లలో 'జిబ్రాన్' తెగిన రెక్కలు రెపరెపలాడుతూ, టపటపలాడ్తూ.... అశ్రుత ఆర్తనాదమైన ..... నిశ్శబ్ద రోదనై... తప తప తపాయని... తనను వినమని.. వినని తనను తనరెక్కల రెపరెపల నాకర్షించాలనీ చేస్తున్న ప్రయత్నాన్ని చూస్తూ....

నా వునికిని తెలియజేయడానికి కుర్చీ శబ్దం చేస్తూ లాగి కూచున్నా.

నందివర్ధనం మీద వాలిన్ననలుపు తెలుపు సీతాకోక చిలుకలు ఎగిరొచ్చి నాచుట్టూ రెపరెపలాడి నా మొహం మీద నిశ్చలనమై...

"హాఁ.. వచ్చావా...! సరిగ్గా సమయానికొచ్చావ్..... రెస్టలెస్‌గా వుంది. యేదో ఏమిటో మాట్లాడాలని.... యేదో చెప్పాలనీ... అన్నీ రహస్యాలే.. నువు తప్ప యింకెవరునా జీవితపు లోతులు చూచిన వాళ్లు...? అందుకే..... నీ గురించే ఆలోచిస్తున్నా.... నీ గురించంటే.. నీ గురించీ కాదు. బాబాయి గురించియెక్కువగా, నీ గురించి తక్కువగా.. నేనేఫోన్చేద్దామనుకునే లోపలే... నువ్వే యిక్కడున్నావ్... థాంక్స్....!"

ఆమె గొంతులో తెలియని ఆవేదన...! పైన ఆకాశంలో కేరింతలు... ఇద్దరం అప్రయత్నంగా తలెత్తి పొడుగ్గా గీచిన గీతలాగా ఒకదాని ప్రక్కనింకోటిగా... కొంగలు బారులుబారులుగాసాగిపోవడం చూశాం.

మదురమైన స్వరంతో ఆమె -

"శ్రేణీ బంధాద్వితన్వద్భిరస్తంభాం తోరణ స్రజమ్..." రఘువంశ శ్లోకం చదివింది.

నాద వినోదిని.... యస్... సరైనపేరది ఆమెకు ....

ముప్ఫై సంవత్సరాల క్రితం బాబాయి, వెంకుమాంబని నామకరణం చేయబద్ధ ఈమెను స్కూల్లో చేర్పిస్తూ రాయించిన పేరు .... నాదవినోదిని.

"యేమిటీ .... ఆలోచిస్తున్నావ్?" శ్లోకం తర్వాతి వచనం.

"బా .... బాబాయి గురించి .... నీ పేరు గురించి .... నువ్వు శ్లోకం చదివితే బాబాయి వెంకుమాంబను నాదవినోదిన్నెందుకు చేశాడో మళ్లీ యింకోసారి గుర్తొచ్చిందంతే. తర్వాత లైనుపాడు వినూ .... ప్లీజ్...."

"సారసైఃకల నిర్హ్రాదైః క్వచిదున్నమితాననౌ"

మళ్లీ నాదం.... ఆ కల నిర్హ్రాదమీమె గొంతు కలో....

ఓ కల ....

"థాంక్స్...."

"పద .... లోపలికెళ్లాం. కాఫీ కలుపుతాను...."

లోపలంతా కోరి కోరి పాలరాయి పరిపించుకుంది వినోదిని. పాలరాతిమీద పట్టి కాళ్లతో నడవమంటుంది .... ఎందుకనబడిగితే యెన్నో వందల వేల యేళ్ల క్రితం భూమి పొరల్లో వెల్తురుకు తెలీకుండా యెవరకీ తెలిని రహస్యంగా, అద్భుతమైన రంగుల్లోకి పరిణామం చెందిన ఈ రాతి మీద మన నగ్న శరీరం తగిలితే... ఆ రాతి స్నిగ్ధత్వంలోంచీ పురాతనత్వం చల్లగా, మెలమెల్లగా మనలోకి ప్రవహించి.... మనల్ని అతి పురాతన కాలంలోకి తీసికెళ్లి మనల్ని శిలాజాలు చేస్తూ .... ఈ పాలరాళ్లు .... సృష్టిర హస్యాన్ని మన తనువంతా చిగురింపచేస్తాయనంటుంది. గోడ మీది 'కకోష్కా' తుపాను నకలుయెవరో భట్నాగరది. యెప్పట్లాగే విషాదంగా పలకరించింది....

కన్సోల్మీద రామప్ప నగ్నికన్త్రాలగించి పేపర్మషే గణేశుడు తాండవిస్తూ ఘనీభవించాడు. కారిడార్కి అటూ యిటూ ఇత్తడి గుండిగల్లో మరుగుజ్జుల

పోయిన్నియానాలు....

ఈ యింట్లో కాళిదాసుకీ, కకోష్కాకీ వున్న సంబంధం కళాభిమానం. కకోష్కా తుపానును గీతం చేసి అందులోని విషాదాన్ని అద్భుతంగా ఆలపించగలదు వినోదిని .... కాళిదాసుని కరిగించి ఘనీభవింపచేసి శిల్పాన్ని చేసి చూపగల్డు భార్గవ.

"ఊ...." కాఫీ వాసనల కమ్మదనం పిలుపులో నింపుకుని .... ఆన్‌గ్లేజ్డ్ చైనా సాసర్ని అర పద్మ ముద్రలో పట్టుకుని వినోదిని ....

"చెప్పు... యేమిటీ .... మనసు బాగా లేదన్నావ్ .... మాట్లాడాలన్నావ్ ...." అడిగా.

"ఇట్లా కాదు... తీరిగ్గా రాత్రి భోజనాని కుండిపో...యేం కావేరీ పర్మిషన్తీసుకోవాలా?" నవ్వుతూ అంది. రక్తచందనం దీవాన్ మీద మఖ్మల్‌బోల్‌స్టర్కానుకుని కూచున్న నేను .... కాఫీ కప్పును పైకెత్తి కాఫీ పరిమళాన్ని గుండెల్నిండా పీల్చి "ప్యూర్ రొబస్టా వితౌట్ చికరీ...." అన్నా.

"పర్లేదు .... నీ జ్ఞానేంద్రియాలింకా పన్జేస్తున్నాయి గానీ .... నా ప్రశ్నకు జవాబివ్వలే...." అంది క్రింద పాలరాతి నేల మీద కూచుని.

"ఈ మూడు దశాబ్దాల్లోనువ్వేనాడూ నన్నుయేదీ అడగలేదు. .... చెబుతూనె వచ్చావు .... ఈనాడు కొత్తగా ఆవిష్కారాలేమీ ఉండవు.... జరగబోవు కూడా...."

ఆ నిశ్శబ్దంలో నేను కాఫీ గుటకలేయడం మాత్రం వినబడుతోంది.

ఆమె ముందుంటే మహా సముద్రాల అలలు కూడా శబ్దించకుండా విరిగిపోగలవు. ఆమె శాసిస్తే కన్రెప్పలు కూడా చప్పుడు చేయగలవు.

నా శరీరమూ, మనసూ, అణువణువూ ఆమె ఆధిక్యతను అవధరించుకున్నాయి. అందుకే అన్ని సంవత్సరాల సాహచర్యంలో కూడా ఆమెతో వివాహాన్ని ప్రతిపాదించలేదు. ఆమెను భార్యగా అసలూహించడం కూడా సాధ్యం కాలేదు .... ఆమె ఓ దేవత నాకు.

"రోర్షాక్ మసిమరకల్ని చదవమంటే ప్రతిదీ నా సిలవట్ అంటావు. నువ్వు ... అని తెల్సీ నిన్నడగటం నా మూర్ఖత్వం...."

పెద్దగా నవ్వింది సుడిగాలి ఎండుటాకుల గజ్జెలతో యింకా నిదుర లెయ్యని తోటల్లో నాట్యం చేసినట్లు.

సియమిస్ పిల్లి లాగా కళ్లు మూసి తెరచి, ఆనందంగా అంగీకరించా.

బైట కారాగిన చప్పుడు.... భార్గవ.... అతన్ని చూడగానే కొద్దిగా కుచించుకు పోతాన్నేను.

నా మీదో నాల్గంగుళాల యెత్తు, వీసమెత్తు కఊడా కొవ్వులేని బలిష్టమైన శరీరం .... యెప్పుడూ నున్నగా మెరిసే చెంపలూ, కళ్లూ, పళ్లూ శుభ్రంగా .... ఆరోగ్యమంటే అతడే అనేట్టుగా యెపుడూ తాజాగా.

"హలో దొరా! హౌసదడే...." అని చెయ్యి చాచాడు పీలగా పల్చగా చెమటతో

తడిసి నాజూగ్గా వున్న నా చేయి నందుకుని, ఇనుప పట్టుతో బిగించి నలిపి, 'పోనీలే పాపం' అన్నట్లు వదిలేసి, కసిగా ఆనందించినట్లు అతని కళ్ళు మెరుపు.

"వస్తా.... స్నానం చేసొస్తా...." మెట్ల మీంచి ఎక్కడికో వేరే లోకాలకన్నట్లు మాయమైపోయాడతను.

'హా...." అని నిట్టూర్చి తల విదిలించుకుని సిగరెట్ వెలిగించా.

నా భావాల్ని చదివినట్టు చిన్నగా తల పంకించి, నవ్వి, నాదవినోదిని "సార్త్ర్ అస్తిత్వ వాదానికి ప్రతిరూపం భార్గవ కదూ.... యెన్ని సార్లనుకోలేదు మనం! నిష్కల్మషంగా ఒప్పుకుంటాడు కూడా తను. 'నీ గురించి ఆలోచించే సమయంలో నా గురించి నేనుయింకొంచెం ఆలోచించగల్ను. అయినా నీ గురించి ఆలోచించు కోడానికింకా నువ్వున్నావుకదా'ని అంటాడు."

భర్త మీద కంటే 'ఎగ్జిస్టెంషలిజం'పై వున్న మక్కువ ఆమె మాటల్లో ధ్వనించింది. 'మార్క్స్'నూవాహన చేసుకున్న బాబాయి పెంచింది అక్షరాలా ఈ వినోదినినే... వ్యక్తివ్యక్తి గురించి కాక వ్యవస్థ గురించి ఆలోచించాలని అహర్నిశలూ అరిచే బాబాయి...

బ్రహ్మసూత్రం విశ్వనాథం పేరు కలిగి వినోదిని బాబాయిగా నా చిన్నతనంలో పరిచయమై.... నాకూఏ వినోదినికీ లోకపు పాఠాలు నేర్పిన మేధావి. వారసత్వాన్ని నిరసిస్తూ అపారమైనసంపదను తన అన్నగారైన వినోదిని తండ్రికి వదిలేసి వెళ్ళిపోయిన త్యాగి .... సిద్ధాంతాపు కవచాన్ని అడ్డుపెట్టుకుని 'మావో' మరో నియంతగా చెలరేగుతున్నాడని మాకు నూరిపోసిన బాబాయి.... తెల్లటీ లాల్చీ పైజమాల్తో నున్నగామెరిసే చెంపల్తో.... జ్వలించే సూర్యుడిలాంటినేత్రాల్తో.... మెత్తటి స్వరంతో సూటిగా మాట్లాడగలిగే బాబాయి.... ఈ రోజున నేను'జర్మను' రెండు ముక్కలు నేర్వగలిగానంటే బాబాయి నించే! 'కాఫ్కా'నూ 'ఫ్రాయిడ్'నూ ఒరిజినల్గా చదివిన బాబాయి.... ఛ్చ యెన్ని రోజులైందో బాబాయినూచ్చసి....?! సిద్ధాంతాన్ని కప్పుకుని .. తన తల మీద రెండు లక్షల రివార్డును మోస్తూ అండర్ గ్రౌండ్‌లోకెళ్ళి పోయిన బాబాయి .... అదే మాట వినోదిన్తో అన్నా....

అందుకే నిన్నుండమంది.... మజ్జాన్నం కొరియర్ ద్వారా చెప్పి పంపించాడు బాబాయి రాత్రి వస్తున్నానని" - బాబాయి వస్తున్నాడన్న ఆనందం ఆమె ముఖంలో యెక్కడా ద్యోతకం కాలేదు. పైపెచ్చు యేదో విషాదపు పొర కమ్మివుందామె ముఖం మీద....

ఇంతలో తాజాగా లావెండర్ పరిమళిస్తూ కుర్తా పైజామాలో హిందీ సినిమా హీరోలా వచ్చాడు భార్గవ. అతని ఎడమ చేతిలో రోజ్ వుడ్ రాకింగ్ చేర్‌వుంది. అంత బరువైన కుర్చీని అవలీలగా అదీ ఎడం చేత్తో మోసేస్తున్న 'అహం' అతని కళ్లలో ఆరోగ్యంగా మెరుస్తోంది.

'దివాన్'కు ఎదురుగా కుర్చీవేసుకుని "నాదా..... నాకో అపిటైజర్.. యీయనకి యేం కావాల్తో నాకు తెలీదు.... యేమిటి సీరియస్‌గా ఆలోచించేస్తున్నారు ....

ఇంటలెక్చువల్స్ కదా .... చెప్పండి అజ్ఞానులం.... వింటాం....” నవ్వుతూ కూచుని వూగుతూ అన్నారు భార్గవ.

అతని భుజం మీద ఛళ్ళున చరచి లోపలికెళ్ళిందామె.

“యస్.... టెల్మీ వాట్ క్రూకెడ్ ప్లాన్సార్యూ డ్రాయింగ్ .... నన్నడిగారు.

“బాబాయ్ వస్తున్నాట.... విను చెప్పింది, అందుకే రాత్రికి నన్నుండిపొమ్మంటోంది”

“వామ్మో....! యిప్పటికే రెండు వికృతమైన తలకాయల్ని తయార్చేసి ఓదాన్ని పర్మినెంట్‌గానూ, ఇంకోదాన్ని అప్పుడప్పుడూ ప్రయోగిస్తూనే వున్నాడాయన నా మీద. యిప్పుడు ఆయనే పర్సనల్గా దాడా...? యేమిటో దొరా! నాకు నచ్చవీ బ్రతుకులు. అందర్నించీ... అన్నింట్నించీ, తప్పించుకు తిరుగుతూ, సుఖాన్ని చెరిపేసుకుని .... అయినా ఆ ముసలాయన కింకా ఎందుకు చెప్పు ప్రజలో ప్రజలో అనేడుస్తాడు. ఆ ప్రజలేం చేశారాయనకు. నెలలో ప్రతిరోజూ రెండుపూటలా షఘుభ్రమైన భోజనమైనా చేస్తాడా ఆయన....? సందుల్లో, చీకట్లలో, మఫ్లర్ చుట్టుకుని టోపేసిన రిక్షాలో, దొడ్డిదారుల్లో రైల్వేస్టేషన్ మెట్ల కిందా .... దాక్కుంటూ, తిరుగాడ్తూ.... అమ్మో....! దయ్యమొచ్చేస్తోంది, అయినా నా కెందుకులే....” వినోదిని రావడం చూచి మాట్లాడ్డం మానేసాడు.

“యేమిటి....! వాగుతున్నాడు....? బాబాయి గురించేనా....? గుచ్చిగుచ్చి చూస్తూ అడిగింది వినోదిని.

భార్గవ మొహంలోకి దీక్షగా చూశాను. కళ్లార్పకుండా పసిపాప తల్లిన్చూసినట్టు చూస్తున్నాడామె కళ్ళలోకి. నిజానికి అతని కళ్ళల్లో బానిసత్వం కనబడ్తోంది నాకు. ఆమెలోని విద్వత్తుకూ, విద్యుత్తుకూ తనను తాను అప్పగించుకున్న భావం.... దాసోహం... దాసోహం... అంటూ.

ఉడికించిన వాము నీళ్లలోకి నిమ్మరసం, తేనెకలుపుకు తాగుతాడు భార్గవ భోజనానికో అరగంట ముందు, సాయంత్రం ఏడూ,ఏడున్నరకంతా భోజనం చేసేస్తాడు. ఒకవేళ వేళ తప్పితే,రాత్రికి పాలు తాగి పడుకుంటాడు.... వాళ్ళ పెళ్ళై పదేళ్లయింది. యేనాడూ అతను క్రమం తప్పడంనే చూళ్లేదు. అందుకనేఅతను అంత ఆరోగ్యంగా వుంటాడు. అప్రయత్నంగా నా వేపు నేను చూసుకున్నానోసారి. పీలగా వున్న కాళ్లని కప్పిన డెనిమ్స్, పైన వదులుగా వేలాడుతున్న స్లాక్స్... ప్రేమగా పెంచుకున్న గడ్డం నిమురుకున్నానోసారి.... పెళ్ళైన కొత్తలో గడ్డం, తీసేస్తే, “ఛీ:... అసయ్యంగా వున్నారు. పెంచెయ్యండి... మళ్ళీ...” అంది కావేరి... అంతే! మళ్ళీ యెప్పుడూ గడ్డం తీయలే....

“మీబుద్ది జీవుల్లో నూటికి తొంభై తొమ్మిది మంది గడ్డాల్పెంచుతారెందుకు దొరా....?” అనడిగేవాడీ భార్గవ కొత్తలో ఆ తర్వాత మానేశాడు.

నన్ను ప్రేమగా ‘దొరా’ అని పిలుస్తాడు. ఇంకో స్నేహితుడ్నీ అలాగే పిలుస్తాడు. మేమిద్దరం, వినోదినీ....తప్ప అతనికి ఆత్మీయులంటూ ఎవరూ లేరని నాకు తెల్సు.

"యేవిటీ....? అంటున్నావ్....' మళ్ళీ రెట్టించి అడిగింది వినూ భార్గవిని.

"యేంలే...." సిస్మోండీ ఇకనామిక్ థాట్‌పెటీ బూర్జువా సోషలిజంకి యెంత ఉపయోగపడిందో తెల్సుకోబుతున్నాను కదా యీ రాత్రి అనంటున్నా..." నవ్వుతూ అన్నాడు.

"ప్లీజ్ భర్గూ.... నన్నేమేనా, యెన్నేనా అను... కానీ దయచేసి బాబాయినేమీ అనకు...." అవిశాలమైన కళ్ల ఆకాశాల నిండా ఒక్కసారి విషాదాల మబ్బులు కమ్ముకున్నాయి.

"సారీ.. సారీ నాదా ప్లీజ్.. ఐడింట్‌మీనిట్.. వూరికినే సరదాకన్నా... బాబాయి మీద గౌరవంలేక కాదు. ఈ వయసులో ఆయనెందుకంతగా ప్రజల గురించి తపన చెందుతున్నాడో అనన్నాను. అంతే యింకేం లేదు అయాం సారీ ఎగేన్...."

"నీకు తెలీదు భర్గూ... నిజానికి నాక్కూడా.... అసలీ ప్రపంచంలో ఎవ్వరికీ తెలీదు ... తను నమ్మినసిద్ధాంతాల కోసం, వాటి నాచరించడం కోసం బాబాయి పొందిన గ్లాని. అందరూ అనుకునేట్టు తనని తానుయేనాడూ హింసించుకోలేదు బాబాయి. తానుతిన్న తర్వాత యింకొకళ్ల తిండి గురించి ఆలోచించాడు.. ముందుతానుతెల్సుకునే యితరులకి తెలియజెప్పడానికి ప్రయత్నించారు. యెందుకు బాబాయ్ మూర్ఖుల్కి నీ శ్రమ ధారబోస్తావ్ 'అనంటే' మామూలు మనిషినే అమ్మలూ నేను. నేను చేస్తున్న పనిలో ఆనందం, తృప్తీ లేకపోతే నేనెందుకు చేస్తాను.. చెప్పు. నేను చేస్తూన్నది నా జీవితానికో అర్థం యిస్తుందన్న నమ్మకం పూర్తిగా ఉండబట్టే నే చేస్తున్నా...! అననేవాడు. అసలు బా...బాబాయిని పూర్తిగా... లోపల్లో తుల్లోకి..." ఆవేశంతో మాట్లాడుతూ ఆపేసింది. ఆమెను అంత వేదనతో యెప్పుడూ చూసెరుగను.

తాను నీళ్లు చప్పరిస్తూ మౌనం తానై మిగిలిపోయాడు భార్గవ...

గతంలోకి జారిపోయి, అక్కడ తెలియని చీకట్లలో... నీడలు....జాడలూ....తెలిసీ తెలియని అస్పష్ట జ్ఞాపక శకలాలు ఒకదాని తర్వాత ఇంకోటి కకావికలుగా.. బాబాయిగదీ... గడ్డం మార్క్స్ ఫొటో.. నడేజ్దా కృప్స్కాయా అనే లెనిన్ ప్రియురాలూ భార్యా.. బాబాయి కోసం వచ్చే పారిజాతం పిన్నీ.. జువ్విచెట్టూ... చెరువు ఒడ్డున తుమ్మచెట్ల కింద బాబాయి పాటా... బాబాయి కోసం మొదటిసారి పోలీసులురావడం... నినదిస్తో జీపెక్కిన బాబాయి... అక్కడెక్కడో ఆ జ్ఞాపకాల చిరుగుల్లో నేను పారేసుకున్న నా బాల్యపు చిరునామాను వెదుక్కుంటూ బరువెక్కిన వాతావరణాన్ని యెలా తేలిక చేయాలా అని ఆలోచిస్తుంటే.

'నా కన్నం పెట్టేయి నా కాకలేస్తోంది" వినోదిని భుజం తట్టి పిలిచాడు భార్గవ.

"పద యిందాకే అంటున్నా 'ఝ్యూం పాల్ సార్త్ర్' భావలేదూ మా ఇంట్లో పేరు మార్చుకు తిరుగుతున్నాడని చిన్నగా నవ్వుతూ అంది. కానీ ఆ నవ్వులో జీవం లేదు.

వాతావరణం తేలిక్కావడంతో "బోరిస్ పాస్తర్నాక్... బాబాయీ యిద్దరూ ఒక్కలాగే

అనిపిస్తారు నాకు.... సంగీతాన్నీ... తత్వశాస్త్రాన్నీ క్షుణ్ణంగా అభ్యసించారిద్దరూ... జాలి లేని సంధ్యాకాశం బాబాయి చక్రవాకంలో పాడ్తోంటే... పాస్తర్నాక్ చదివినట్టు అనిపించేది నాకు. పోతే పాస్తర్నాక్ ఆ సిద్ధాంతాన్నీ నమ్మలేదు. తాను నమ్మిన సిద్ధాంతమేతననుతరుముతోందిక్కడ బాబాయిని... ప్చ్ ఆ జ్ఞాన శూన్యుల్లోకి జొరబడి..దోసిళ్ళతో అక్షరాలు చల్లుతూ వాళ్ళ ఆకలి కేకలకూ... వాళ్ళకై వాళ్ళు యుగాల క్రితం తొడుక్కున్న సంకెళ్ళకూ... ఈ సభ్యసమాజం జవాబుదారీ కాదూ.. ఆ సంకెళ్లు... ఆ ఆకలీ... బానిసత్వమూ, వాళ్లకై వాళ్ళు కొనితెచ్చుకున్నవేననీ... ఆ మాటని ఆ పీడితులనబడే వాళ్ళ చేతే అవుననిపించి.. ఈ రోజున పెద్దగా ఎఱుపు అరుపు అరిచేవాళ్ళ కంటి కురుపై.. ఒకనాడు తాను తీర్చిదిద్దిన వాళ్లే తనను తరుముతూంటే.. అటు వాళ్లకూ.. యిటు పోలీసులకు మధ్యన తన ఉనికిని కాపాడుకుంటూ.. ఇంకా తన సంచీలో మిగిలిన అక్షరాలను,పిడికళ్ళ పట్టి పాదరసంలా తిరిగే బాబాయిని తల్చుకుని బాధైంది. అంతే నాదా!

ఆయనంటే నాకెంతిష్టమో నీకు తెలీయదా?" భారంగా అన్నాడు భార్గవ.

ఆ రాత్రి పన్నెండు వరకూ ఎదురు చూశాం... బాబాయి రాలేదు.. యిక ఈ రోజుకి రాడనుకుని యింటికొచ్చేశా...

✦ ✦ ✦

తెల్లవారుఝామున నాలుగ్గంటలకు కావేరి కుదుపుతూ లేపితే లేచా... మౌత్‌పీస్‌కి చెయ్యడ్డం పెట్టి ఫోన్ పట్టుకునుంది. "భార్గవ గారు.." మెల్లిగా అంది. కళ్లు చికిలిస్తూ ఫోన్తీసుకుని... "లోఁ..." అన్నా...

"సారీ దొరా...బా...బాబాయి.. డెడ్... సపోస్డ్ టుబి ఎన్ ఎన్కౌంటర్.. కామాక్షీ నగర్.. సమ్ అనానిమస్ కాల్.. నాదా అస్సలు మాట్లాడ్డం లేదు... త్వరగా రా.. ప్లీజ్ త్వర్గా అయ్ నీడ్యూ" గాబరాగా భార్గవ స్వరం...

తెలుసు...మా కందరికీ తెల్సు యీ వార్తయిట్లాగే వుంటుందనీ, బాబాయ్ కావ్యంలో చివరి వాక్యమిదేనని మాకు తెలుసు.

కానీ నిజాన్ని మనస్పొప్పుకోడం లేదు.

కాఫీ కప్పుతో కావేరి.. కప్పందుకుని పక్కకు పెట్టి కావేరి చుట్టూ చేతులేసి, ఆమెలో మొహం దాచుకున్నా.

తల నిమురుతూ, ముందు వినోదిన్ని చూడాలి పదండి..." అంది కావేరి.

✦ ✦ ✦

రెండ్రోజుల్తర్వాత బాబాయి భౌతికకాయాన్ని అప్పగించారు పోలీసులు.

వినోదిని నాన్నా యిద్దరు అత్తగార్లూ వచ్చారు. వినోదిని యింటిబైటే చిన్న వేదిక లాంటి దేర్పాటు చేశారు.

మొన్నటివరకూ బాబాయిని వ్యతిరేకించినవాళ్ళూ, బాబాయంటే భయపడి చచ్చిన వాళ్లూ, పార్టీ సిద్ధాంతాలను కల్తీచేసి, మకిలీ పట్టించాడని గోల చేసిన వాళ్లూ...అంతా

వాళ్లే...

ఎర ఎఱ్రగా మారిపోయింది ప్రాంగణమంతా... బాబాయి మృత్యున్ని క్యాపిటలైజ్ చేసుకోవడానికి చూసేవాళ్లే అంతా...

వినోదిని అసలు మాట్లాడ్డం లేదు. భార్గవకిదంతా యిబ్బందిగా వున్నా, వినోదిని కోసం మౌనంగా భరిస్తున్నాడు.

పెద్ద జనప్రవాహం వెంటరాగా తరలివెళ్ళిపోయాడు బాబాయ్.

వినోదిని బయటిగ్గాడా రాలేదు. తన గదిలోంచి కిటికీలోంచి దీర్ఘంగా శూన్యంలోకి చూస్తూ నుంచుంది.

శరీరం పాడుకాకుండా పెట్టిన మంచుముద్దలు కరిగిన నీళ్ళలో మరణించినన ఎఱ్ర గులాబీల రేకులూ... వరిపొట్టూ... అత్తరు వాసనలూ, మరణ వాతావరణాన్నింకా గుర్తు చేస్తూనే వున్నాయి.

కావేరీ లోపల వంట చేస్తోంది.

మధ్యాహ్నం రెండున్నర ప్రాంతంలో ఓ యిరవై, యిరవై ఐదేళ్ళ యువకుడు సంశయిస్తూ వచ్చి.....

"నా.. నాదవినోదిని గారూ...?"అని అడిగాడు.

"హూం అర్యూ...?" భార్గవ కరకుగా అడిగాడతన్ని.

"ఇది.... ఇది నాన్నగారిది.. ఓ పది రోజుల్కిందు ఆర్మూరు బస్టాండులో కల్సి, ఈ అడ్రసులో ఇమ్మన్నారు. నాద వినోదినిగార్కి..."

బాబాయిని పార్టీలో 'నాన్న' అనంటారు.

యెక్కడ్నించీ విన్నదోకానీ సుడిగాలిలా పరిగెత్తుకవచ్చి, అతని చేతిలో, బ్రౌన్ కవర్లో వున్న పాకెట్నీ లాగేసుకుంది వినోదిని.

".....అయాం వినోదిని...థ్యాంక్యూ...." అంతే వేగంతో వెళ్ళి మేడ మెట్లెక్కేసింది.

మళ్ళీ కలుస్తామని భార్గవకి చెప్పి, నేనూ కావేరీ, యాంత్రికత్వం నీడల్లో చేరి మా మనసుల్ని మరచి సేదతీర్చుకునే ప్రయత్నాల్లో ... మేము.

✦✦✦

ఓ పది రోజుల్తర్వాత సాయంత్రం ఫోన్జేసింది వినోదిని. "డైరెక్టుగా యిక్కడికిరా... పనుంది." క్లుప్తతలో భావతీవ్రతను వ్యక్తం చేస్తూ.

వెళ్లేప్పటికి చుట్టూ అడ్డుగోడల్లేనిరెల్లు పాకలో కూచుని ఫిలోడెండ్రాన్స్ కోసంకుంపట్లో గుంజలకి పీట్మాస్ చుడ్తూ కనిపించింది.

నన్ను చూసి "లేట్గా వస్తావనుకున్నా..రా.. వచ్చి సాయం చెయ్యి.... ఆ కలేడియం కుంపట్లన్నీ ఫెర్న్ క్రింది వరుసలో పెట్టుకుంటూరా..." అంది.

నేను కుంపట్లు సర్దేలోపల లోపలికెళ్లి పెద్ద మగ్గులతో కాఫీ కలుపుకొచ్చింది.

"వూం........ చెప్పు యేమిటి పిల్చావ్....?" అనడిగా.

"ఆ రోజు....... ఆ కుర్రాడు తెచ్చిచ్చాడు చూడు...! ప్యాకెట్... ! అది బాబాయ్

డైరీ..!! ఈ సంవత్సరందే...! పాతవి యెప్పటికప్పుడు తగలబెట్టేస్తాడు బాబాయి... నీకుతెల్సుగా, అది చూపాలనే పిలిచా..అది నేను చదవాలని బాబాయి ఎందుకనుకున్నాడో నాకు తెలుసు. నువ్వు కూడా చదివితే నాక్కాస్త రిలీఫ్...''

''తే.....తే.....త్వరగా...'' ఆత్రుతతలో అడిగా.

''ఇస్తా... యింటికెళ్ళి తీరిగ్గా చదువు. తర్వాత దాని గురించి జీవితంలో యేనాడూ నాతో తర్కించకు. నేను చెప్పలేని విషయాలను నువ్వు గ్రహించగలవనే నమ్మకంతోనూ నీ నుంచీ యేదో దాచానన్న గిల్ట్ పోగొట్టుకోడానికీ.. నీకా డైరీ యిస్తాను... సరేనా!''

మౌనంగా తలూపాను.

''బాబాయి మహర్షి....'' తనకి తానను కుంటూన్నట్లుగా అంది.

మౌనంగా కాఫీ చప్పరిస్తూ ఆమెనే చూస్తున్నా.

చూస్తుండగానే కళ్ళనిండా నీళ్ళు నిండిపోయి, ధారగా ఆమె బుగ్గల మీదుగా ప్రవహించి పొర్లుతున్నాయి. ఆకన్నీటి వరద వెనక ఘుర్జిల్లిన శోకం మౌనంగా ఆమెలో పది రోజులుగా సుడులు తిరుగుతూనే ఉంది... ఈ రోజున విస్ఫోటనం.!

భార్గవ వచ్చి చూసి, ''ఈ రోజుకు కొట్టుకుపోయింది.. ఇన్ని రోజులుగా భయంగా వుణ్ణింది దొరా..! మాట్లాడదూ.. యేడవదూ...., భరించలేకపోయా. తెల్సిన విషయమే అయినా .......యస్....అయికెనండస్టాండ్..!

పక్కన కూచున్న భార్గవ భుజానికి తలానించి మౌనంగా అట్లా ఉండిపోయింది నాదవినోదిని.

✦ ✦ ✦

డైరీ నిండా లెక్కలూ, స్థలాల పేర్లూ... అర్థంకాని బాబాయికి మాత్రమే అర్థమయ్యే కొండగుర్తులూ, అరకొరగా సంఘటనల వివరణలూ... హఠాత్తుగా ప్రత్యక్షమయ్యే కవితా వాక్యాలూ... పరిచయం లేని వ్యక్తుల పేర్లూ... మధ్యలో బీహార్ బొగ్గుగని పనివాళ్ళ లేఖ వొకటీ...

హఠాత్తుగా జులై ఏడున ఆగిపోయింది డైరీ....!

ఏదో తారీఖు మాత్రం మూడుపేజీలై విస్తరించుకుంది. ఆగస్టు యిరవై నాలుగున బాబాయి మరణించాడు...!

దిళ్లకానుకుని మనస్సంతా ఎక్కుపెట్టి, జులై ఏడు చదవడం మొదలుపెట్టా...

జులై 7, మధ్యాహ్నం 1.45 నిముషాలు.

ప్రపంచం యావత్తూ నిశ్శబ్దంగా జీవిస్తూ మరణిస్తూ మనుగడ సాగిస్తూ....

సుజాతకు ఎప్పుడయినా డెలివరీ కావచ్చు అనిఅనుకుంటునే వున్నా.. ఆమెను ఈ అడవి దాటించి తీరాలి...

మేమ్మొకుమ్మడిగా నమ్మిన సిద్ధాంతాల కోసం భర్తగా నమ్మిన భానుమూర్తిని ఫణంగా పెట్టి, ప్రాకృతికంగా తన మీద పడ్డ బరువును అసహాయంగా మోస్తూన్న సుజాతను ఈ అడవి దాటించాలి. ఎనిమిది కిలోమీటర్లు నడవలేదని తెలుసు.కానీ

తప్పదు. డెలివరీ కింకా వారం గడువుందనే ధైర్యంతో నేనూ, సుజాతా బయల్దేరాం. ఇంకొద్ది దూరం బైరాగుల మిట్ట చేరితే చాలు. శంకర్ మోపెడ్ తీసుకొచ్చుంటాడు. అక్కడ్నించే వాళ్ళిద్దర్నీ పంపించేయవచ్చు... బైరాగుల మిట్ట వచ్చే సరికి ఆయాసపడుత్తూ... చెమటలు కక్కుతూన్న సుజాత గట్టిగా అర్చి కూచుండిపోయింది. నాకు తెలిసి పోయింది. ప్రసవం జరగబోతుంది. మిట్ట దగ్గరికి మోపెడ్‌తో వస్తానన్న శంకర్ జాడ లేదు. ఊళ్లో విజిల్ తీవ్రమై ఉంటుంది. అశక్తతా....అసమాయతా.. ముసలితనం.. అది ప్రసాదించిన చేతకానితనం... వీటన్నిటి మీదా కోపమొచ్చింది. సుజాత యిక్కడే ప్రసవిస్తుంది. నాకు తెలుసు. కానీ యేమీ చేయలేనితనం... ఈ అడవిలో, బండరాళ్ల మధ్య నాగరికతల వాసనల్లేని ఓ నగ్న శిశువు ప్రభవించబోతోందన్న సత్యం జీర్ణం కావడంలేదు.

బేసిక్ మిడ్ వైఫరీ గురించి నేర్చిన సూత్రాలు గుర్తు రావడం లేదు... అనుభవ రాహిత్యం... సుజాతని మెల్లిగా లేపి నీడగా ఓ పెద్ద బండచాటుకు తీసుకెళ్ళా.. నాకిప్పుడు తెల్సు... నేనే డెలివరీ చేయాలి... నేను తప్ప యిక్కడ ఈ అమ్మాయి కెవ్వరూ లేరు... తప్పదు.. నిర్ణయించేసుకున్నా.

"నాన్నా!... నాన్నా!.. అని ఆర్తితో అరుస్తోంది సుజాత.

"బేరిట్ మై చైల్డ్.. బేరిట్.... యేం కాదు.... నిబ్బరంగా వుండు. నేను డెలివరీ చేస్తానమ్మా.... నాన్నని కదూ...యస్ అయికెన్డూయిట్ భయపడకు..." అనంటున్నా నాలో నాకే అనిశ్చితభావన. నాకే భయం.. భయం కెనై డూయిట్? అని నాకు నేను...

ఆమె కాళ్ళ మధ్య రక్తస్రావం మొదలైంది. ఆమె వస్త్రాల్ని తప్పించా... "తల్లీ సుజా! నేను నాన్నని చూడమ్మా... వియ్‌కెన్డూ యిట్టుగెదర్ .. ఓర్చుకో తల్లీ!"

కళ్లు మసక బారుతున్నాయి.

"నాన్నా... నాన్నా....భరించలేన్నానా!" అరుస్తో... ఆ అసహాయురాలు.

"అదిగో తల....సుజాతా.... పుష్ పుష్... గట్టిగా యస్ యిట్స్ కమింగ్.." అన్నది నేనేనా...?!

తెగి వూడి పడిన మాంసపు ముద్ద... తీగలు తీగలుగా ... రక్తపు మరకలు మరకలుగా.. చేతి కందీ అందక జారిపోయే నాభినాళం.. దారం..! దారం..!? గుర్తుతెచ్చుకున్న మిడ్‌వైఫరీ.. ఎమర్జన్సీ సూత్రాలు చించిన గుడ్డ పేలిక ముడులై నాభిని కత్తిరించడానికీ, మాయనుత్తరించడానికీ, మడత కత్తి తెరచి, తెగ్గొట్టి టవల్తో తుడిచి తలక్రిందులుగా వేల్లాడుతున్న శైశవం....!!

సుజాత ఒంట్లోంచి గుడ్డలు గుడ్డలుగా రక్తం....! కుండలో పోసినట్టు ఆ బండనంతా తడిపేసింది.

సుజాత కళ్ళుమూసుకుపోతున్నాయి. నాడి బలహీనంగా నా చేతి వేళ్లకందకుండా.. తెలిసిపోయింది.

రెక్కలు చాచుకుని మృత్యువు వాలబోతోంది... కళ్ళు వాలిపోతూ సుజాత.

"నా..న్నా...పాప....పాప యిలా కావద్దు...నా....న్నా....ప్లీ...!"

ఆగిపోయిన శ్వాస.. సరిగ్గా ఒంటిగంట.

"కేరు కేరు మంటూ ఆ శైశవం...

చేరువనే సుజాత శవం...

భావాలు తెలియని జీవమొకటి,

విగత జీవ భావమోటి...

అలసిపోయానా... నేను...?! యేదో తప్పు చేసిన భావన కలుగుతోందెందుకని...? మృత్యువు నెన్నిసార్లు చూళ్లేదు నేను....?

యిప్పుడెందుకు...హత్యచేసిన భావన కలుగుతోందీ..? వయస్సుతోపాటూ, ఆశయాలకూ వృద్ధాప్యమొస్తుందా...?!

చేతుల్లో కసిగుడ్డు 'కేరు'మని అసహాయంగా... ఆ నైర్మల్యం.... ఆ యేడుపూ...!

యేవాదం....? యే శాస్త్రం...? యే భావాల్తో వచ్చిందీ శైశవం లోకంలోకి..? యే వ్యక్తిత్వంలోకి పరిణమిస్తుంది?

'వాదాల మూసలొద్దు' అని శరీరాన్ని చించుకుని కని మరణించిన తల్లి అంది.

.....కొన్ని వేల సంవత్సరాల క్రితం... ఓ స్త్రీ ఇట్లాగే యింకో జీవానికి జన్మనిచ్చుం డొచ్చు. యెప్పుడో అప్పుడు నాగరికతలింకా మొలవలనప్పుడూ...భాష కూడా జన్మించని అప్పుడూ.. యిట్లాగే... బండల సందున....గుహల్లో. చెట్టునా, పుట్టనా...! యిప్పుడూ....?!

యిన్ని వందల వేల సంవత్సరాల పరిణామానంతరం యెన్నెన్నో నాగరికతలు ప్రభవించి శిథిలమై... మనిషి మహోన్నతుడై యెదిగాడంటున్న రోజున..... మళ్ళీ గుట్టల్లో..... బండల మీద.. ఈ అడవి మధ్యలో...!

యెక్కడ..? యెక్కడున్నాన్నేను......? చరిత్రకందని ఆ చీకటి రోజుల్లోనా..? ఆ పురాతనత్వంలోనా....?

నా మీద నేను యుగాల తరబడిగా కప్పుకుంటూ వచ్చిన నాగరికతలన్నీ పొలుసులు పొలుసులుగా రాలిపోతున్న భావన....! మనిషి మీద మనిషి కప్పిన యేవేవో సాంఘికసూత్రాల పొరలు ఒక్కటొక్కటిగా వూడిపోతున్నట్టూ... విడిపోతూ న్నట్టూ....!!

శతాబ్దాల చరిత్రలో మనిషి అనే పదాన్ని నిర్మించిన ఆలోచన అన్న మహోత్కృష్ట తత్వానికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

- ఆ తర్వాత అన్నీ ఖాళీ పేజీలే.. రెపరెపలాడ్తూ తర్వాత యేమీ రాయకుండా..

బాబాయి డైరీని వినోదినికి పంపడంలో ఉద్దేశమేమి? యేదో తెలీని శూన్యం లోపలంతా నిండుకున్నట్టు.

వినోదినికి డైరీ పంపుతూ ఉత్తరం కూడా వ్రాసుంటాడా..... బాబాయి...? యెందుకని డైరీని ముందే పంపించాడు...? తాను మరణిస్తున్నట్లు ముందుగానే తెలుసుకున్నాడా

బాబాయి..?! సుజాత కన్న పసిపాప యేమైంది...? వినోదిని డైరి గురించి జీవితంలో యేనాడూ ప్రస్తావించొద్దని ఖచ్చితంగా యెందుకు చెప్పింది...? వినూ ఆ పాపనుచూసిందా...? మనస్సంతా కకావికలుగా విడిపోయింది.

మనసును పిసుక్కునీ చంపుకోలేక, మర్నాడు భార్గవని అతని ఫ్యాక్టరీకెళ్ళి కలుసుకున్నా.

అతని ఆఫీసు గదవిలో కూచుని నా మనసునూ, బాధనూ కక్కేసా.

"నిజానికి నీకు వచ్చిన అనుమానాలన్నీ నాకూ వచ్చాయి. అసలు యే ప్రశ్నకీ సమగ్రమైన సమాధానమంటూ వుండదేమో దొరా...! మనం సంగ్రహించుకున్న సమాచారంతో మనకి మనం జవాబులు చెప్పుకుంటాం. సత్యానికి సాధ్యమైనంత చేరువగా వెళ్లడానికి ప్రయత్నిస్తాం. కానీ సత్యం మననించీ యెప్పుడూ జారిపోతూనే ఉంటుంది... 'అబ్సల్యూట్' అన్నదానికి అసలు అర్థం లేదేమో..! బాబాయి డైరీని నేనూ చదివాను. బాబాయిలో మార్పు సైద్ధాంతికం కాకుండా వైయుక్తికం కావచ్చు. అసలు బాబాయిలో మార్పు అన్నది కూడా మనకై మనం ఊహించుకుని, మన ప్రశ్నల్లో సమాదానాలకు ముడిసరుకుగా మనం తయారుచేసుకున్నదేనేమో.... ఆలోచించావా? సుజాత మరణంలో మనిషి పుట్టుకను నగ్నంగా చూచిన బాబాయి, ప్రపంచంలో మానవత్వాన్ని దిగంబరంగా చూశాడు. ఆ మానవత్వానికి ఏ సిద్ధాంతపు అలంకరణలూ లేవు. ఒక్క బాబాయి వైయక్తిక విలువలు తప్ప వారసత్వాన్ని తీవ్రంగా నిరసించే బాబాయి, ఓ పదిహేను రోజుల క్రితం నాదని కలిసి, తనకు భాగంగా రావాల్సిన ఆస్తి గురించి మాట్లాడాడట. నీకు తెల్సు నాద ఒక్కతే ఆ యింట సంతానం... అసలు ముందు సుజాత బిడ్డని పెంచమని నాదని అడిగాడుట బాబాయి. నాకు కూడా తెలీని కారణాలతో నాద అంగీకరించలేదు. యెందుకూ? అని, నేను అడగలేదు నాదని. ఆమెని అస్సలు మనమెవ్వరమూ ఆ కారణాలనడగకూడదని ఆమె మాట. నిజమే...! ఆమె అంతరంగంలోకి తొంగి చూసే హక్కు మనకు లేదు. బాబాయి సంగతి నీకు బాగా తెలుసు. పట్టుదల గల వ్యక్తి. ఆ పసిదాన్ని సుజాత తల్లిదండ్రులకు అప్పజెప్పాడనుకుంటాను.నీకు తెలియాల్సిందింకోటి.. బాబాయి ఎన్‌కౌంటర్ జరిగింది సుజాత తల్లిదండ్రులింటి ముందే...! కామాక్షి నగర్..! ఆ రాత్రి బాబాయి యెందుకువెళ్లాడో వాళ్లింటికి వెళ్ళాడు. అక్కడ వాళ్లు బాబాయితో దేనికో గొడవ పడ్డారు. గొంతులుపెద్దవి చేసి అరిచారు. అప్పటికే సుజాత యింటి మీద కన్నేసుంచిన పోలీసులకు చాలా సులభమైపోయింది... రిజల్ట్...బాబాయ్ డెత్!! యిప్పుడు నాదలో వున్నది బాబాయిని తానే హత్య చేశానేమోనన్న గిల్ట్. తాను ఆ పసిదాన్ని పెంచడానికి అంగీకరించుండాల్సిందా...? అంగీకరించుంటే అసలు బాబాయి కామాక్షీ నగర్‌కు వెళ్లుండే వాడే కాదేమో..? యిట్లా..ఎన్నో రకాలుగా..." పెద్దగా నిట్టూరుస్తూ చెప్పడం ఆపాడు భార్గవ.

నా ప్రశ్నలకి సమాధానం పూర్తిగా దొరక్కపోయినా భార్గవ అన్నట్టు సమాదానాలకి,

యింకొంచెం సమాచారం దొరికంది.

మనసులో బాధ సుడులు తిరుగుతూనే వుంది... లేచి కిటికీలోంచి బైటి ప్రపంచాన్ని చూశాను..... ఫ్యాక్టరీ రోడ్డుని పొలాలగుండా హైవేకి కలుపుతూరోడ్డు వేస్తున్నారు. ఆ కూలీల్లో బక్కపల్చగా వున్నా, ధృడంగా వున్న దేహంతో ఇనుప తట్టనిండా రాళ్లు మోస్తూ ఓ వృద్ధుడుఎందుకో ఒక్కసారి బాబాయి లాగా అనిపించాడు!!

✦

***(రచన ఇంటింటి పత్రిక : సెప్టెంబర్ 1999)***